ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ముస్తాబాద్ తహసీల్ కార్యాలయం ఎదుట విద్యార్థుల ధర్నా



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న అనిల్

ఇల్లంతకుంట: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. మండల అధ్యక్షుడు ఆదిత్య, డీవైఎఫ్ఐ కార్యదర్శి నాగరాజు, అనిల్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ముస్తాబాద్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నాయకులు, విద్యార్థులు శుక్రవారం ధర్నా చేపట్టారు. తహసీల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేశ్ మాట్లాడారు. బండి ప్రణయ్ పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ డివిజన్ భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేయాలని మండల తహసీల్ కార్యాలయం ముట్టడించారు. తహసీల్దార్ మహేశ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడారు. సాయిభరత్, శివ, ప్రభాస్, రవితేజ, అఖిల్, రవి, సంతోష్ తదితరులున్నారు.

వీర్నపల్లి: తెలంగాణ రాష్ట్రంలో స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం ముట్టడించారు. జిల్లా ఉపాధ్యక్షుడు జాలపెల్లి మనోజ్‌కుమార్ మాట్లాడారు. తహసీల్దార్ మారుతిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. దినాకర్, రాబిన్సన్, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన కేటీఆర్



క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న కేటీఆర్



ఘటనా స్థలంలో క్షతగాత్రులు

తంగళ్లపల్లి: సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మానవత్వం చాటారు. శుక్రవారం సిరిసిల్లలో పర్యటన ముగించుకొని వెళ్తున్న క్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం రామచంద్రాపూర్–జిల్లెల్ల గ్రామాల మధ్య ఓమ్నీ వ్యాన్, స్కూటీ ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. గమనించిన కేటీఆర్ వెంటనే తన కాన్వాయ్ ఆపి క్షతగాత్రుల వద్దకు వెళ్లి పరామర్శించారు. వెంటనే అధికారులకు ఫోన్ చేసి మూడు అంబులెన్స్‌లలో క్షతగాత్రులను సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో నర్సింహులపల్లెకు చెందిన వేల్పుల సంజీవ్, దుద్దెడకు చెందిన రమేశ్ అపస్మారక స్థితిలోకి వెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ తరలించారు. వీరు ఓ ట్రాన్స్‌పోర్టులో డ్రైవర్లుగా పని చేస్తున్నారు. ఓమ్నీలో వెళ్తున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. కాగా కేటీఆర్ స్పందించిన తీరుకు పలువురు వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాదంపై వివరాలు సేకరిస్తున్నామని, ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేస్తామని ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

పునఃప్రారంభమైన ప్రాజెక్టు పనులు

వేములవాడరూరల్: మర్రిపల్లి గ్రామం వద్ద ఉన్న ఎల్లంపల్లి రిజర్వాయర్ పనులు పునఃప్రారంభమయ్యాయి. దాదాపు 250 ఎకరాల్లో 2004 సంవత్సరంలో రూ.1,737కోట్ల అంచనాలతో 5 పంప్‌హౌస్‌లను కలుపుకొని 6 డెలివరీస్(పైపులైన్‌లు), 16 ట్యాంకులతోపాటు గ్రావిటీ కెనాల్‌లతో పనులు ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 2,350 ఎకరాలకు సాగునీరు అందనుంది. కానీ పనులు పూర్తి కాక మధ్యలోనే ఆగిపోయాయి. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక దృష్టి పెట్టి సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు ప్రారంభించారు.



మర్రిపల్లి రిజర్వాయర్ వద్ద జరుగుతున్న పనులు

ప్రాజెక్టు నమూనా..

ఈ ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి వేమునూరు వద్ద పంప్‌హౌస్ నుంచి మేడారం మీదుగా గంగాధర వరకు, అక్కడి నుంచి కొడిమ్యాల వరకు, కొడిమ్యాల నుంచి ఫాజుల్‌నగర్ ప్రాజెక్టు మీదుగా గ్రావిటీ కెనాల్ ద్వారా బండపల్లి వరకు చేరుకొని అక్కడి నుంచి నర్సింగాపూర్ తూం ద్వారా మర్రిపల్లి ప్రాజెక్టులోకి చేరుకుంటుంది. ప్రాజెక్టులో భాగంగా 16 ట్యాంకులకు గాను 7 ట్యాంకులు పూర్తయ్యాయి. మిగతా 9 ట్యాంకులు పూర్తి చేయాల్సి ఉంది. ఈ పనులు 2025 డిసెంబర్ వరకు పూర్తి చేసి ప్రాజెక్టులోకి పూర్తి స్థాయిలో ఎల్లంపల్లి నీరు నింపడానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్



తాడూరులో చెక్కులు అందజేస్తున్న స్వరూప

తంగళ్లపల్లి: సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరమని సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెలుముల స్వరూప, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని అన్నారు. శుక్రవారం తాడూరు, దేశాయిపల్లె, అంకిరెడ్డిపల్లె గ్రామాల్లో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, డైరెక్టర్లు అరెపల్లి బాలు, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: రాచర్లగొల్లపల్లిలో లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. ముగ్గురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను వారి ఇళ్ల వద్దకెళ్లి అందజేశారు. జిల్లా మైనార్టీ అధ్యక్షుడు సాహెబ్, జిల్లా కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ నారాయణరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, చేపూరి రాజేశం, అందె బాలయ్య, నాగిరెడ్డి, మల్లేశ్, ఎల్లయ్య, సామెల్ పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన కార్మికులు

సిరిసిల్ల: సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావును మున్సిపల్ కార్మికులు కలిసి తమ సమస్యపై వినతి పత్రం అందించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్‌కు తరలివెళ్తున్న కార్మికులు కేటీఆర్‌ను కలిసి సమస్యలు వివరించారు. అన్నల్‌దాస్ గణేశ్, కాసారపు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో 'ఎక్స్‌టెన్షన్ లెక్చరర్'

గంభీరావుపేట: గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎక్స్‌టెన్షన్ లెక్చరర్ అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇతర డిగ్రీ కళాశాలకు చెందిన లెక్చరర్లు వచ్చి ఇక్కడి విద్యార్థులకు సబ్జెక్టులపై అవగాహన కల్పిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులకు సంబంధించిన సిద్దిపేట డిగ్రీ కళాశాల అధ్యాపకులు మహేశ్, మనోహర్ విద్యార్థులకు సబ్జెక్టులపరమైన అంశాలను వివరించారు. బోధనా పద్ధతులు, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన అధ్యాపకుడు డాక్టర్ శ్రావణ్‌కుమార్‌ను ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థుల్లో అభ్యసన స్థాయి పెంచాలి

కోనరావుపేట: విద్యార్థుల్లో అభ్యసన స్థాయి పెంపొందించాలని మండల విద్యాధికారి మురళీ నాయక్ అన్నారు. కనగర్తిలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను శుక్రవారం సందర్శించారు.

అయోడిన్ ఉప్పును వినియోగించాలి

సిరిసిల్ల: అయోడిన్ ఉప్పును వినియోగించాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ రాజగోపాల్‌రావు కోరారు. ప్రపంచ అయోడిన్ లోపాల రుగ్మతల నివారణ దినోత్సవం సందర్భంగా సిరిసిల్లలోని బీవైనగర్, సంజీవయ్యనగర్, తంగళ్లపల్లి మండలం నేరెళ్ల బాలిక గురుకులంలో శుక్రవారం విద్యార్థులకు అయోడిన్ ఉప్పుపై అవగాహన కల్పించారు. అయోడిన్ ఉప్పు వాడడం వల్ల మానసిక శారీరక ఆరోగ్యం పెరుగుదల, లాభాల గురించి వివరించారు. స్కూల్ హెచ్ఎంలు కవిత, ఆంజనేయులు, సీహెచ్‌వో సత్యనారాయణ, ఏఎన్ఎం వాణి, ఎన్ హెచ్ఎం ఉమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఎస్ఎఫ్‌సీ నిధులు రూ.5లక్షలతో సీసీ రోడ్డు పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి శుక్రవారం భూమిపూజ చేశారు.

సభను విజయవంతం చేయండి

ఎల్లారెడ్డిపేట: జగిత్యాల పట్టణంలో ఈనెల 27న నిర్వహించే ఉమ్మడి జిల్లా ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

ఇల్లంతకుంట: మాదిగల ధర్మయుద్ధ సన్నాహక సదస్సుకు మాదిగలు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ భిక్షపతి కోరారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఎల్లారెడ్డిపేట: ప్రజలు పచ్చదనం, పరిశుభ్రతపై దృష్టి సారించాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారథి టీమ్ లీడర్ ఎడమల శ్రీధర్‌రెడ్డి కోరారు. రాచర్లగుండారంలో ప్రభుత్వ పథకాలు, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కళాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

కోనరావుపేట: టీఎస్‌యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడిగా మ్యాక వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా గాలిపెల్లి సంతోష్ ఎన్నికైనట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్‌రావు, జిల్లా కార్యదర్శి జంగిటి రాజు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా వంగరి లక్ష్మీప్రసాద్, మహిళా ఉపాధ్యక్షురాలిగా కట్టా రాజమణి, కోశాధికారిగా శిలగాని మహేశ్, కార్యదర్శులుగా గుంటుకు సతీశ్, మాడుగుల రేణుక ఎన్నికయ్యారు.

వేములవాడరూరల్: జాతీయ బీసీ యువజన సంఘం వేములవాడ రూరల్ మండల కమిటీని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు దండు వినోద్ తెలిపారు. కమిటీకి నియామక పత్రాన్ని శుక్రవారం అందజేశారు. అధ్యక్షుడిగా మంద మనోహర్, ఉపాధ్యక్షుడిగా వంగ మహేందర్, ప్రధాన కార్యదర్శిగా దుర్గపు సురేశ్, కార్యదర్శిగా ఎగుర్ల శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా పెద్దపల్లి మనోజ్, కోశాధికారిగా జంగం నరేశ్ ఎన్నికయ్యారు.

పటేల్ పురస్కారానికి ఎంపిక

కోనరావుపేట: సుద్దాలకు చెందిన పర్యావరణ ప్రేమికులు తండ్రి ప్రకృతి ప్రకాశ్, కూతురు బ్లెస్సీ సర్దార్ వల్లభాయ్‌పటేల్ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈనెల 27న హైదరాబాద్‌లో ఏర్పాటు చేసే కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ రమేశ్‌రెడ్డి చేతుల మీదుగా అందుకోనున్నారు. పర్యావరణ పరిరక్షణకు కొన్నేళ్లుగా కృషి చేస్తున్నారు.



ప్రకాశ్



బ్లెస్సీ

బహిరంగంగా వాగ్వాదాలు.. అంతర్గతంగా విందులు

- అంతుపట్టని చందుర్తి సింగిల్‌విండో పాలకవర్గం తీరు
- పక్కదారి పట్టిన నిధులకు బాధ్యులెవరు..



చందుర్తి సింగిల్‌విండో సమావేశం(ఫైల్)

చందుర్తి: సింగిల్‌విండో పాలకవర్గంలోని కొందరి సభ్యుల తీరు విచిత్రంగా మారింది. చందుర్తి సింగిల్‌విండో కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసుకున్న పాలకవర్గ సభ్యుల సమావేశంలో సీఈవో, చైర్మన్లు కలిసి డబ్బులు పక్కదారి పట్టించారని ఆగ్రహంతో ఊగిపోయిన సభ్యులు.. సమావేశం ముగిసిన అరగంట లోపే కార్యాలయంలోనే చైర్మన్ చాంబర్‌లో చికెన్ బిర్యానీలతో విందుల సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. సమావేశంలో తమ పేరుపై రూ.లక్ష ఎలా రాసిపెట్టారని ఆగ్రహంతో ఊగిపోయిన వైస్ చైర్మన్.. గంటలోపే చైర్మన్‌తో కలిసి బిర్యానీ విందు చేసుకోవడం వెనక సింగిల్‌విండోలో ఏం జరుగుతుందోనన్న చర్చ సొసైటీ పరిధిలోని రైతుల్లో మొదలైంది. ఎరువుల వసూలు ధరకు బస్తాకు రూ.30కు తక్కువగా విక్రయించినట్లు రికార్డులో నమోదు చేయించి, మిగతా డబ్బులు ఎవరెవరు కాజేయాలని చూశారన్న సందేహాలు పాలకవర్గ సమావేశం అనంతరం రైతుల్లో చర్చనీయాంశంగా మారాయి. బయటకు మాత్రం చైర్మన్, సీఈవోలు కలిసి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు చేస్తున్న డైరెక్టర్లు.. వారి అవినీతిని ఎండగట్టకుండా లోపాయికారి ఒప్పందాలకు ఎందుకు పాల్పడుతునారని రైతులే ప్రశ్నించుకుంటున్నారు. కార్యాలయ సిబ్బంది సుతిలి దారం 36 క్వింటాళ్లను రూ.7,750 ధర చొప్పున కొనుగోలు చేశామని, మిగతా రూ1.93లక్షలు అదనంగా నమోదు చేశామని డైరెక్టర్ల సమక్షంలో నిగ్గు తేల్చి చెప్పారు. రూ.లక్ష నా పేరిట ఎలా రాశారని మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చందుర్తి సింగిల్‌విండోలో అవినీతి, అక్రమాలను బయటపెట్టేందుకు సహకార సంఘం అధికారులు దాటవేస్తున్నారు.

విందులు వాస్తవమే..

చందుర్తి సింగిల్‌విండో పాలకవర్గ సభ్యుల సమావేశం ముగియగానే చైర్మన్ చాంబర్‌లో బిర్యానీ విందులు చేసుకున్న మాట వాస్తవమే. అందులో కొందరు డైరెక్టర్లే ఉన్నారు. అందరూ లేరు.

– చింతపంటి రామస్వామి, సింగిల్‌విండో డైరెక్టర్, చందుర్తి

51 చట్టం విచారణలోకి..

చందుర్తి సింగిల్‌విండోలో జరిగిన అవినీతి, అక్రమాలన్నీ 51 చట్టం విచారణలోకి వస్తుంది. కొత్తగా వచ్చిన ఆరోపణలను కూడా విచారణ అధికారులకే నివేదిస్తాం. అక్రమాలు జరిగితే విచారణ కమిటీ తేలుస్తుంది.

– రామకృష్ణ, జిల్లా సహకార సంఘం అధికారి, రాజన్న సిరిసిల్ల

క్లుప్తంగా

దొంగతనం కేసులో వ్యక్తికి జైలు

వేములవాడఅర్బన్: దొంగతనం కేసులో వ్యక్తికి 4 నెలల జైలుశిక్ష విధిస్తూ వేములవాడ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌కు చెందిన మైలారం శ్రీనివాస్‌కు చెందిన కరెంటు మోటార్ తీగను జూన్ 17న నిజామాబాద్ జిల్లా వీరన్నగుట్టకు చెందిన గుండారం గంగారం దొంగిలించాడు. వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు విచారణలో నిందితుడిని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

హనుమాన్ ఆలయంలో చోరీ

ఎల్లారెడ్డిపేట: బండలింగంపల్లిలో గల శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం రాత్రి గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయానికి సాయంత్రం తాళం వేసి వెళ్లిన పూజారి శుక్రవారం తెల్లవారుజామున వచ్చి చూసేసరికి ఆలయం తలుపులు పగులగొట్టి ఉన్నాయి. ఆలయంలోని హుండీని ధ్వంసం చేసి అందులోని సుమారు రూ.6వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనపై ఆలయ కమిటీ చైర్మన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఇసుక లారీ పట్టివేత

ఎల్లారెడ్డిపేట: రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులో శుక్రవారం పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు ఇసుక లారీ కనిపించడంతో తనిఖీ చేయగా అనుమతులు లేకుండా తరలిస్తున్నట్లు తెలిసి లారీని పట్టుకున్నారు. ఎస్సై రమాకాంత్ వివరాల ప్రకారం.. కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రానికి చెందిన చొప్పరి స్వామి అనే లారీ డ్రైవర్ లారీలో ఇసుకను బావుపేట నుంచి కామారెడ్డికి దొంగతనంగా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. లారీని స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. లారీ యజమాని పెంటల రమేశ్, డ్రైవర్ స్వామిలపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ముగ్గురిపై కేసు

మండల కేంద్రానికి చెందిన మంచిర్యాల అఖిల అనే డాక్టర్‌ను అదనపు వరకట్నం కోసం వేధిస్తున్న ఘటనలో ముగ్గురిపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ వివరాల ప్రకారం.. అఖిలకు 2014లో కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం మోషన్‌పూర్ గ్రామానికి చెందిన మంచిర్యాల నరేశ్‌తో వివాహం జరిగింది. కొంతకాలం వీరి కాపురం సజావుగా సాగినా.. కొంతకాలంగా రూ.5లక్షల అదనపు వరకట్నం తీసుకురావాలని భర్త నరేశ్‌తోపాటు ఆడబిడ్డ కృష్ణవేణి, ఆడబిడ్డ భర్త చంద్రం కలిసి వేధింపులకు గురిచేశారు. అఖిల పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

వీర్నపల్లి: గర్జనపల్లి ప్రాథమిక పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు రేసు గౌతమి, కొత్తపల్లి మమత, పసుల అరుణలకు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూక్య గజన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. గొర్రె కరుణ, బుచ్చగారి రాకేశ్, గజ్జెల ప్రశాంత్, నలిమేటి నాగరాజు, నగరపు దేవేందర్, గుంటుకు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: కొండాపూర్ ప్రాథమిక పాఠశాలలో తొమ్మిది సంవత్సరాలుగా విద్యాభివృద్ధి కోసం పని చేసిన ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని గ్రామస్తులు అన్నారు. కొండాపూర్ ప్రాథమిక పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్లిన హెచ్ఎం మధుసూదన్, ఉపాధ్యాయులు భాగ్య, రజిత, మధులను శుక్రవారం గ్రామస్తులు, పాఠశాల యజమాన్యం ఘనంగా సత్కరించింది.

కేటీఆర్‌ది కపట ప్రేమ

తంగళ్లపల్లి: బీఆర్ఎస్ పార్టీని, నాయకులను ప్రజలు ఛీత్కరించుకున్నారు కాబట్టే ప్రభుత్వాన్ని కోల్పోయారని, కాంగ్రెస్ పార్టీకి ప్రజలే పట్టం కట్టి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుల మీద కపట ప్రేమ కనబరుస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ప్రభుత్వంలో ఉండగా రైతులు గుర్తు రాలేదా అని ప్రశ్నించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, ఏఎంసీ డైరెక్టర్లు అరెపల్లి బాలు, పొన్నాల పరశురాము, మండల ఉపాధ్యక్షుడు గుగ్గిళ్ల శ్రీకాంత్‌గౌడ్, బీసీ సెల్ అధ్యక్షుడు కావటి మల్లేశంయాదవ్, మైనార్టీ అధ్యక్షుడు ఇక్బాల్, నాయకులు కొత్త రవి, మిరాల శ్రీనివాస్‌యాదవ్, బాలసాని శ్రీనివాస్, రమేశ్, గుగ్గిళ్ల భరత్, అభిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కమీషన్ల సత్యనారాయణ అనడం సరికాదు

ఇల్లంతకుంట: మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కమీషన్ల సత్యనారాయణ అని అనడం సబబు కాదని కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి అన్నారు. శుక్రవారం ఇల్లంతకుంట మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండల అధ్యక్షుడు బి.రాఘవరెడ్డి, ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, ఐరెడ్డి సురేందర్‌రెడ్డి, బట్టి చంద్రమౌళి పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: కస్బేకట్కూర్ గ్రామంలో అనుమతులు లేకుండా రెండు అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. అధికారులకు తెలిపినా చర్యలు తీసుకోవడం లేదు. సామాన్యులు పర్మిషన్ కోసం దరఖాస్తు చేసుకున్నా అనేక ప్రశ్నలు వేస్తుంటారు. బాడా బాబులను మాత్రం పట్టించుకోరా. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ కట్టడంపై చర్యలు తీసుకోవాలి.

– అజయ్‌రావు, కస్బేకట్కూర్



సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
మీర్జా బేగ్, మండల పంచాయతీ అధికారి, తంగళ్లపల్లి, సెల్ నం.: 9490083683

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం

సిరిసిల్లటౌన్: సుభాష్‌నగర్‌కు చెందిన నేహ పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించి సత్తా చాటింది. హైదరాబాద్‌లోని నరేశ్ క్లాసిక్‌లో జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 60 కిలోల విభాగంలో పాల్గొని 122.5 కిలోల బరువు ఎత్తి మొదటి స్థానంలో నిలిచింది. ఆమె రెండు గోల్డ్ మెడల్స్ సాధించి ప్రశంసా పత్రాలను అందుకుంది. నేహ మాట్లాడుతూ.. గురువులు శేఖర్, నిఖిల్, సత్య, ఆసిఫ్, నివాస్, అబిద్, సుమంత్‌లకు కృతజ్ఞతలు తెలిపింది. 2సంవత్సరాలుగా ప్రతిరోజు 75 కిలోమీటర్లు ప్రయాణించి మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లి సిద్దిపేట జిల్లాలో ట్రెనింగ్ తీసుకున్నట్లు పేర్కొంది. తన కల నెరవేరినందుకు సంతోషం వ్యక్తం చేసింది.

రాష్ట్రస్థాయి ఉషు పోటీలకు ఎంపిక

గంభీరావుపేట: కొత్తపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన శివకుమార్ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–19 ఉషు పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 22న కరీంనగర్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. శివకుమార్‌ను కరీంనగర్ జిల్లా ఒలింపిక్ జనరల్ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, జిల్లా ఉషు కార్యదర్శి బార విద్యాసాగర్, శిక్షకుడు విక్రమ్ అభినందించారు.

వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో శుక్రవారం సాయంత్రం 4 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	05	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	08	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	03	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	04	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	06	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	10	560
నందీశ్వర సూట్స్	03	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	08	448
పార్వతీపురం స్పెషల్	05	672
పార్వతీపురం సాధారణ	12	336

– వేములవాడ

సంక్షిప్త వార్తలు

పాత్రికేయులకు పరామర్శ

కోనరావుపేట: నిమ్మపల్లి గ్రామానికి చెందిన పాత్రికేయులు దప్పుల కరుణాకర్, నరేశ్‌ను చెన్నమనేని వికాస్‌రావు శుక్రవారం పరామర్శించారు. వీరి తల్లి దేవవ్వ ఇటీవల మృతిచెందింది. నిజామాబాద్‌లో బడే నర్సయ్య, కొలనూర్‌లో మాజీ ఉప సర్పంచ్ శంకర్‌ను పరామర్శించారు.

ఇల్లంతకుంట: అనంతారం గ్రామ మాజీ ఎంపీటీసీ తీగల పుష్పలత నాగయ్య అత్తమ్మ రత్నవ్వ మూడు రోజుల క్రితం మరణించగా.. రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మెంబర్ ఒరగంటి ఆనంద్ శుక్రవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రజల కోసమే పోలీసులు

ముస్తాబాద్: ప్రజల కోసమే పోలీసులు పని చేస్తున్నారని ఎస్సై గణేశ్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏఎస్సై రమణ, హెచ్‌సీలు బాల్‌నర్సయ్య, చంద్రశేఖర్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట: రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని రాచర్లబొప్పాపూర్ ఏఎంసీ చైర్మన్ సాబేరబేగం కోరారు. రాచర్ల తిమ్మాపూర్ గ్రామంలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. తిమ్మాపూర్ సింగిల్‌విండో చైర్మన్ సుధీర్‌రావు, వైస్ చైర్మన్ కృష్ణమూర్తిశర్మ, నర్సయ్య, గౌస్, రాజేందర్, రాంరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

బోయినపల్లి: ప్రభుత్వం హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు శ్రీధర్ అన్నారు. తడగొండలో శుక్రవారం మాట్లాడారు. కోరె మల్లయ్య, రవీందర్, సీహెచ్ రాజశేఖర్, పర్శరాములు, గజ్జె బీరయ్య, తోట మహేశ్, వెంకటేశ్ తదితరులున్నారు.

సేవాలాల్ ఆలయ నిర్మాణానికి సహకరించాలి

ఎల్లారెడ్డిపేట: గిరిజనుల ఆరాధ్య దైవం సంతు సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి సహకరించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు గిరిజన సంఘం నేతలు విన్నవించారు. శుక్రవారం సిరిసిల్లలో కేటీఆర్‌ను కలిసి వినతిపత్రమిచ్చారు.

పోచమ్మ ఆలయానికి విరాళం

బోయినపల్లి: తడగొండ గ్రామంలో పోచమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణానికి గ్రామానికి చెందిన చేపూరి గంగయ్య కుమారుడు శ్రీనివాస్ శుక్రవారం రూ.50వేలు విరాళంగా అందించారు.

ఆలయ నిర్మాణానికి సహకరించాలి

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని పురాతన శ్రీవేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి గ్రామస్తులు సహకరించాలని ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు కోరారు. ఆలయ ఆవరణలో శుక్రవారం గ్రామంలోని 29 కుల సంఘాలకు చెందిన నాయకులు, ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సభ్యుడు నంది కిషన్ మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి టీటీడీ రూ.1.80కోట్లు మంజూరు చేయగా.. ఆ నిధుల విషయంలో గ్రామంలో గందరగోళ పరిస్థితి ఏర్పడిందన్నారు. నిధుల మంజూరు విషయంలో అపోహలను నమ్మొద్దని కోరారు. కొన్ని సాంకేతిక కారణాలతో నిధులు తాత్కాలికంగా నిలిచిపోయాయని, నిధులు వచ్చేవరకు వేచిచూడకుండా గ్రామస్తులు భాగస్వాములై పూర్తి చేసుకోవాలని సూచించారు.

విప్‌ను కలిసిన సీపీఐ నాయకులు

సిరిసిల్ల అర్బన్: వేములవాడ పట్టణంలో సీపీఐ నాయకులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు మాట్లాడుతూ.. సిరిసిల్ల పట్టణంలోని 1,581 సర్వే నంబర్‌లో సుమారు 15కోట్ల విలువైన రెండెకరాల 10 గుంటల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకోవాలని చూస్తున్నారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని విప్‌ను కోరామన్నారు. బాచుపల్లి శంకర్, రాజయ్య, శ్రీనివాస్, రాములు, రాజేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన నాయకులు

బోయినపల్లి: మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన కాలె నారాయణరెడ్డిని శుక్రవారం మండలంలోని పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతపల్లి గ్రామ నాయకులు జంగ సత్యం, కంకణాల పురుశోత్తంరెడ్డి, వంగపల్లి రాజిరెడ్డి, అనుపట్ల తిరుపతిరెడ్డి, చంద్రగిరి ప్రేమ్‌చంద్, గంగాధర అంజయ్య తదితరులు తహసీల్దార్‌ను సన్మానించారు.

గుండె జబ్బును గుర్తించడంలో ఈసీజీ కీలకం

సిరిసిల్ల టౌన్: ప్రాథమికంగా గుండె జబ్బును గుర్తించడంలో ఈసీజీ కీలక పాత్ర పోషిస్తుందని మెడికవర్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ అనీష్ పబ్బ అన్నారు. పట్టణంలో ఎంబీబీఎస్ వైద్యులకు ఏర్పాటు చేసిన ఈసీజీపై శిక్షణ సదస్సులో పాల్గొని మెళకువలు నేర్పించారు.